నాలా విస్తరణతో పలు కాలనీలకు తప్పిన వరద ముప్పు

- ప్యాట్నీ ఏరియా మునగడానికి అక్కడివారే కారణమన్న స్థానికులు
- త్వరగా నాలా పనులు పూర్తి చేయాలన్న నివాసితులు

విశ్వంభర, హైదరాబాద్: ప్యాట్నీ నాలా విస్తరణతో ఎగువ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఉన్న కాలనీలకు వరద ముప్పు తప్పిందని అక్కడి నివాసితులు చెబుతున్నారు. గత శుక్రవారం 11 నుంచి 14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనా తాము ఉంటున్న ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిలవలేదన్నారు. హస్మత్‌పేట నాలా, పికెట్ నాలాలు ఎంత ప్రమాదకరంగా ప్రవహిస్తాయో నగరవాసులందరికీ తెలుసని.. ఆ రెండు నాలాలు ప్యాట్నీ దగ్గర కలుస్తాయని చెప్పారు. రెండు నాలాలు కలిసిన చోట ఉన్న నాలా వెడల్పు (26 మీటర్లు) ప్యాట్నీ దగ్గరకు వచ్చేసరికి కేవలం 5 నుంచి 7 మీటర్లకు కుంచించుకుపోవడం వల్ల ప్రతి ఏటా వరద కాలనీలను ముంచెత్తేదని.. ఈ సారి హైడ్రా, కంటోన్మెంట్ సంయుక్తాధ్వర్యంలో విస్తరణ పనులు చేపట్టడంతో ఆ ముప్పు తప్పిందని పాయిగా కాలనీ, విమాన్‌నగర్, బీహెచ్ ఈఎల్ కాలనీ, మార్గదర్శి కాలనీ, లక్ష్మిగుంటి కాలనీ, ఇందిరానగర్ బస్తీలతో పాటు.. పలు కాలనీలు నీట మునిగేవని చెబుతున్నారు. ఇక్కడున్న నివాస ప్రాంతాల్లో పేద, మధ్యతరగతికి చెందినవారే ఎక్కువని.. హైడ్రాకు ఫిర్యాదు చేసిన వెంటనే తమకు రక్షణగా నిలిచిందన్నారు. ప్యాట్నీ పరిసరాలు నీట మునగడానికి అక్కడి ఆక్రమణదారులే కారణమంటున్నారు. నాలా విస్తరణ పనులను అడ్డుకుని.. ఇప్పుడు లబోదిబో అంటున్నారు. కొంతమంది మీడియా వారి వాదన వాస్తవం అనుకుంటున్నారు. అందులో ఎలాంటి వాస్తవం లేదని లెక్కలతో వివరిస్తున్నారు. శుక్రవారం కూడా అనేకమందిని బోట్ల సాయంతో హైడ్రా కాపాడిందని చెబుతున్నారు. విస్తరణతో జరిగిన మేలును వివరిస్తున్నారు. ఇంతకీ రసూల్‌పురా, పికెట్ నాలా పరిసర ప్రాంతాల నివాసితులు ఏమంటున్నారో వారి మాటల్లోనే..!

నాలా విస్తరణ జరగకుంటే..?..

కేవలం 5 సెంటీమీటర్ల వర్షపాతానికే చాలా నివాస ప్రాంతాలు నీట మునిగేవి. అలాంటిది 10 సెంటీమీటర్ల వర్షం నమోదైతే హస్మత్‌పేట నాలా, పికెట్ నాలా పరీవాహక ప్రాంతాలు.. వందలాది నివాస ప్రాంతాలు నీట మునిగేవి. లక్షలాది కుటుంబాలు ఇబ్బందులు పడేవి. ప్రతి ఏటా వాహనాలు, ఇంట్లో సామాన్లు, నిత్యావసరాలు నీట మునిగిపోయేవి. కష్టపడి సంపాదించినదంతా ఒక్క వర్షానికే కొట్టుకుపోయేవి. దీంతో భయంగా వర్షాకాలం గడిపేవాళ్లం.

ప్యాట్నీ నాలా విస్తరణతో ఏం జరిగింది..?..

గత శుక్రవారం మల్కాజిగిరి ప్రాంతంలో 14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ మొత్తంలో వరద వచ్చింది. ప్యాట్నీ దగ్గర నాలాను వెడల్పు చేయడంతో ఈసారి తమ ప్రాంతాలు భద్రంగా ఉన్నాయి.

అందుకే దశాబ్దాలుగా కంటోన్మెంట్ బోర్డుకు ఫిర్యాదు చేశాం.. జూన్ నెలారంభంలో హైడ్రా ను కూడా ఆశ్రయించాం. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వెంటనే హైడ్రా స్పందించింది. అదే నెల 6వ తేదీన ప్యాట్నీ నాలావద్ద ఆక్రమణలను తొలిగించింది. ఈ ఏడాది వరద ముప్పు తప్పింది. హస్మత్‌పేట నాలా దాదాపు 12 కిలోమీటర్లు, పికెట్ నాలా 5 కిలోమీటర్ల మేర ప్రవహించి ప్యాట్నీ వద్ద కలుస్తాయి. నాలా విస్తరణ పనులు పూర్తయితే లక్షలాది కుటుంబాలు భద్రంగా ఉంటాయి.

ప్యాట్నీ నాలా అసలు విస్తీర్ణం ఎంత..?..

హస్మత్‌పేట నాలా పికెట్ నాలా ప్యాట్నీ వద్ద కలుస్తాయి. ఈ రెండు నాలాలు చెరి 13 మీటర్ల వెడల్పుతో సాగుతున్నాయి. ఈ రెండు నాలాలు కలిసిన చోట 26 మీటర్ల వెడల్పు ఉండాలి. ఇలా కొనసాగితే ఇబ్బందులుండేవి కావు. రసూల్‌పురా వద్ద సికింద్రాబాద్ ప్రధాన దారిలో నిర్మించిన వంతెనను పరిశీలించినా ఇది రుజువు అవుతుంది. కాని ప్యాట్నీప్రాంతంలో అక్రమ కట్టడాలు వచ్చాయి. దీంతో అక్కడ కేవలం 5 నుంచి 7 మీటర్లకే పరిమితమైంది. రసూల్‌పురా వంతెన వద్ద కంటోన్మెంట్ ప్రాంతం వైపు 17 మీటర్లున్నా.. అదే వంతెన వద్ద జీహెచ్ ఎంసీ వైపు 26 మీటర్లుంది. ప్యాట్నీ ప్రాంతంలో ఆక్రమణలతో కేవలం 7 మీటర్లకే పరిమితమైంది.

ప్యాట్నీ ప్రాంతం మునగడానికి కారకులెవరు..?..

ప్యాట్నీ నాలా విస్తరణ పనులను కంటోన్మెంట్ బోర్డుతో కలిసి హైడ్రా జూన్ నెల 6వ తేదీన చేపట్టింది.

ప్యాట్నీ వద్ద ఆక్రమణలను తొలగించింది. నాలాను 17 మీటర్ల మేర విస్తరించింది. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కూడా సిద్ధమైన వేళ.. అక్కడి వారు కోర్టుకు వెళ్లి పనులను ఆపేశారు. ఆ పనులు ఆగిపోవడంతో పై నుంచి వచ్చిన వరద ప్యాట్నీ ప్రాంతాన్ని ముంచెత్తింది. ఇప్పుడు వారే ఇబ్బంది పడుతున్నారు. అక్కడ పూర్తి స్థాయి విస్తరణ పనులు, రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగిపోతే ఇబ్బంది ఉండేది కాదు. చకచకా సాగిపోతున్న పనులను అడ్డుకున్నారు. దీంతో వరద ముంచెత్తింది.

మీడియాను ఎవరు తప్పుదోవ పట్టిస్తున్నారు..?..

ప్యాట్నీ ప్రాంతంలో నాలాను కబ్జా చేసి.. షెడ్డులు, వాణిజ్య సముదాయాలు నిర్మించిన వారే మీడియాను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇక్కడ హైడ్రా తొలగించిన ఏ నిర్మాణానికి అనుమతులు లేవు. పైన ఉన్న నివాస ప్రాంతాలు ఏమైపోయినా.. ఫర్వాలేదు అని భావించిన వారు.. కొంతమంది మీడియా ప్రతినిధులను తప్పుదోవ పట్టిస్తున్నారు. తప్పుడు సమాచారం ఇస్తున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని అడ్డుకున్న విషయాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మీడియా ముందు లబోదిబోమంటున్నారు.

ప్యాట్నీ వద్ద తాత్కాలిక రిటైనింగ్ వాల్..

ప్యాట్నీ పరిసరాలను వరద ముంచెత్తకుండా.. నాలాకు తాత్కాలిక రిటైనింగ్ వాల్‌ను కంటోన్మెంట్ బోర్డు ఏర్పాటు చేసింది. శాశ్వతంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టేందుకు ఉన్న ఆటంకాలను కూడా తొలగించేందుకు హైడ్రా కృషి చేస్తోంది. అప్పటి వరకూ వరద ప్యాట్నీ ప్రాంతాలను ముంచెత్తకుండా.. ఇసుక బస్తాలతో కంటోన్మెంట్ బోర్డు అడ్డుకట్ట వేసింది. వారం, పది రోజుల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేసేందుకు కంటోన్మెంట్ బోర్డు కసరత్తు చేస్తోంది.



పాతబస్తీ నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు

విశ్వంభర, హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పాతబస్తీ అలియాబాద్ మేకలబండ నల్లపోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.ఆషాఢ మాసం బోనాల జాతర సందర్భంగా ఆదివారం ఎంపీ రవిచంద్ర నల్లపోచమ్మ తల్లిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ పూజారి ఎంపీ రవిచంద్రతో పాటు కూసం శ్రీనివాస్,మోహన్ రెడ్డిలను కండువాలతో సత్కరించి,ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.నల్లపోచమ్మ తల్లి ఆలయ సందర్శనకు విచ్చేసిన ఎంపీ రవిచంద్రను మున్నూరుకాపు ప్రముఖులు తూడి ప్రవీణ్ కుమార్,పొన్న వెంకటరమణ తదితర ప్రముఖులు సాదర స్వాగతం పలికారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేసిన సీఐ మారుతి శంకర్

విశ్వంభర, సత్యసాయి : సత్యసాయి జిల్లా కేంద్రంలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేకకార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేకకార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని , అటువంటి వాటికి స్వస్తి పలికి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని పోలీసు అధికారులు హెచ్చరించారు.

యువత ఉపాధి అవకాశాలు ఏర్పరుచుకోవాలి

విశ్వంభర, ఆమనగల్లు: ఆమనగల్ పట్టణ కేంద్రంలోకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాలే మల్లయ్య అయ్యప్ప గుడి సమీపంలో ఏర్పాటు చేసిన టీ పాయింట్ ను ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూప్రస్తుత కాలంలో యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా,స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకుని వ్యాపారాన్ని ప్రారంభించడం అభినందనీయమని,చిన్నస్థాయి వ్యాపారాలు కూడా ఆత్మవిశ్వాసంతో చేస్తే పెద్ద స్థాయిలో విజయాలకు నాంది అవుతాయని,యువత స్వయంగా ఉపాధి అవకాశాలు వెతుక్కుని ముందుకు సాగితేనే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని, ఉద్యోగ అన్వేషణతో పాటు స్వయం మార్గాలను కూడా యువత దృష్టిలో ఉంచుకొని వారి కెరీర్ని నిర్మించుకోవాలని తెలియజేశారు.ఈ సందర్భంగా యజమాని కాలే మల్లయ్య కి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, కృష్ణ నాయక్,కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,, పున్న దినేష్, నాయకులు ఐ ఎన్ టి యు సి ప్రసాద్, మల్లేష్‌నాయక్,కొండల్ యాదవ్,గుండ్రాతి కుమార్ గౌడ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రభుత్వం నుండి పట్టు వస్త్రాల సమర్పణ

విశ్వంభర, గౌలిపుర : హైదరాబాద్ బోనాల మహోత్సవాలను పురస్కరించుకొని ఈరోజు శ్రీశ్రీశ్రీ మహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం కు గౌరవనీయ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి గారు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు భరతమాత దేవాలయం అమ్మవారికి సమర్పించారు, ఈ కార్యక్రమంలో భాగంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ నుండి శివ రుద్ర నోడల్ ఆఫీసర్ వారి సిబ్బంది పాల్గొని యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మని కైలాష్ గంగపుత్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి గారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.మరియు అధ్యక్షులు కేవీఎస్ ఆనందరావు ఆలయ ముఖ్య సలహాదారు కె జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు బివై శ్రీకాంత్, శ్రవణ్ కుమార్ లక్ష్మణరావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఆషాడ మాసం బోనాల పండుగ పురస్కరించుకొని బాగ్ అంబర్పేట్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్థానిక కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి .

- విశ్వంభర, హైదరాబాద్

వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేద్దాం

- అధ్యక్షుడు వందనపు ఆంజనేయులు

విశ్వంభర, చింతపల్లి : ఆగస్టు 3వ తేదీన హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేద్దామని చింతపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వందనపు ఆంజనేయులు అన్నారు. ఆదివారము వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్త తో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వైశ్యుల ఆత్మగౌరవం హక్కుల సాధనకై వైశ్య రాజకీయ రణభేరిని నిర్వహిస్తున్నామని తెలిపారు. మేమెంతో మాకు అంత డిమాండ్లతో ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొర్వి గిరి, దాచేపల్లి మధు, వంగాల రమేష్, కొర్వి రాధాకృష్ణ, కొమిరిశెట్టి వినోద్, ఆగుతోట జంగయ్య ,కుంచకూరి రాము, తేరటుపల్లి కిషోర్, బచ్చు సురేష్, కొమిరిశెట్టి సురేష్,నంగునూరి రమేష్, బుక్కాఈశ్వరయ్య, కొదుమూరి దయాకర్,సముద్రాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు

- మహిళల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- కసిరెడ్డి నారాయణరెడ్డి

విశ్వంభర, కల్వకుర్తి : కల్వకుర్తి మండల కేంద్రంలోని సి కె ఆర్ ఫంక్షన్ హాల్ లో కల్వకుర్తి, వెల్దండ మండలాలకు సంబంధించిన మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరామహిళా శక్తి సంబరాలు ఘనంగా జరిగాయి..ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ భాగత్ సంతోష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వం ప్రధానంగా మహిళల ఆర్థిక, సామాజిక, సాధికారతకే ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు..ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవంలా వడ్డీ లేని రుణాల పంపిణీ జరుగుతుందని చెప్పారు..మహిళలను మహారాణులుగా గౌరవిస్తూ,వారికి ఆర్థికంగా స్వావలంబన కల్పించేలా అనేక మార్గాల్లో ముందడుగు వేస్తున్నామని తెలిపారు..కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తోందని అన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉండి ముందుకు నడిపిస్తోందన్నారు.మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ప్రమాద భీమా, రుణ భీమా కల్పనతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు,సోలార్ విద్యుత్ ఉత్పత్తి, పాఠశాలలు, క్యాంటీన్లు,పెట్రోల్ బంకుల నిర్వహణ, స్కూల్ యూనిఫామ్‌ల తయారీ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ పనులు మహిళలకే అప్పగిస్తూ, వారికి ఉపాధిని కల్పిస్తున్నామని తెలిపారు. కల్వకుర్తినియోజకవర్గంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి మహిళలే నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా కృషి చేద్దామని,అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గంలో పండిన పంటలకు ఒక బ్రాండ్ క్రియేట్ చేసి మహిళా సంఘాల ఆధ్వర్యంలో వాటిని సేల్స్ & మార్కెటింగ్ చేస్తే బాగుంటుందని,ఆ దిశగా ప్రణాళికలు చేపడుదామని స కల్వకుర్తి నియోజకవర్గానికి మహిళా సంఘం తరపున పెట్రోల్ బంక్ మంజూరు కావడం అభినందించదగ్గ విషయమని పెట్రోల్ బంక్ నిర్వహణ కోసం ఏ మహిళా సంఘం అయితే ముందుకు వస్తుందో వారికి అనుకూలమైన ప్రదేశంలో స్థలాన్ని కేటాయించి పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సహకరించి ప్రోత్సహిస్తామని చెప్పారు. మహిళలు అందరూ తమలోని శక్తి, నైపుణ్యాలను,కళలను, సృజనాత్మకతను వెలికి తీసి అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, అన్ని రంగాల్లో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు ఆనంద్ కుమార్, భూపతి రెడ్డి సింగిల్ విండో మాజీ డైరెక్టర్ వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన నల్లబెల్లి యువత

విశ్వంభర, నల్లబెల్లి : యువ నాయకుడు మేడిపెల్లి రాజు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ లో 100 మంది యువకుల చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆహ్వానించారు. ఈసందర్బంగా మాట్లాడుతూ యువతను మోసంచేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో బుద్ది చెప్పాలి రోడ్లను రద్దుచేసి గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి నిధులను సొంత ఏజెన్సీ కాంట్రాక్టు సంస్థకు కాంట్రాక్టు పనుల కోసం ప్రాజెక్ట్ కడుతనంటూ కొత్త డ్రామాలు మొదలుపెట్టిన రైతుల యూరియా కష్టాలు తీర్చలేని అసమర్ధ కాంగ్రెస్ ప్రభుత్వం. కేసీఆర్ నాయకత్వం లో మండలంలోని అన్ని గ్రామాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసాన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాలలో అభివృద్ధి శూన్యం మండల అభివృద్ధికి నేను తెచ్చిన నిధులను రద్దుచేసి అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మహిళా సంఘాల భవనాలు కమ్యూనిటీ హాల్స్ సెంట్రల్ లైటింగ్,గ్రామపంచాయతీ భవనాల కోసం నిధులు తెస్తే అవి చెల్లవని కాంగ్రెస్ పార్టీ అసమర్ధ నాయకులు ప్రచారం చేస్తున్నారు. అదే జీవో ల ద్వారా వచ్చిన రోడ్ల పనులు రద్దు చేస్తున్నారు. సంక్షేమ పథకాల పేరుతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ వసూళ్ల దందా చేస్తున్నారు.పోలీసులను అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజలపై మా పార్టీ కార్యకర్తల పైన దాడులు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ పిఎసిఎస్ చైర్మన్ మాజీ ఎంపీపీలు క్లస్టర్ బాధ్యులు మండల పార్టీ నాయకులు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసీలు గ్రామ పార్టీ అధ్యక్షులుపార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలి

విశ్వంభర, హనుమకొండ : గన్ పార్క్ లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ జి జిల్లా కన్వీనర్ ఓడపల్లి శ్యామ్ కృష్ణ, కందగట్ల మోహన్, ఉమ్మడి జిల్లా మీడియా కన్వీనర్ అనుముల రమేష్, హనుమకొండ జిల్లా కన్వీనర్ కందికట్ల జయ, రాష్ట్ర కార్యదర్శిలు మాట్లాడుతూ ఈ నెల 22న హైదరాబాద్ గన్ పార్క్ వద్ద తల పెట్టిన నిరసన ధర్నా కార్యక్రమానికి ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలనీ పిలుపు నిచ్చారు. ఆదివారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో లోని 6 వ అంశాన్ని వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేసారు. ఉద్యమకారులను గుర్తించే దుకు ఒక ప్రత్యేకమైన కమిటీ వేయాలని కోరిన ప్రభుత్వం ఇప్పటివరకు తాత్సరం చేస్తుందని, ప్రభుత్వం తీరును ఎండగట్టారు.జార్ఖండ్ తరహాలో ఉద్యమకారులకు ఇచ్చినట్లు ప్రతి ఉద్యమకారునికి 250 గజాల స్థలం, ప్రతి నెల 25 వేల పెన్షన్ సౌకర్యం, తెలంగాణ పోరాటంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారునికి గుర్తించి గుర్తింపు కార్డులు, ఉచిత బస్సు, రైల్వే సౌకర్యం కలిపించాలి. అదే విదంగా ఉద్యమకారులకు సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిసే విధంగా మన ఐక్యత నినాదాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో మెడికల్ జేఏసీ ఇంచార్జి సోమ మధు, బట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు దేవునితో సమానం

రోగులకు మెరుగైన వైద్యం అందించి వారి మన్ననలు పొందాలి

మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి

విశ్వంభర, నల్లగొండ : పేదలకు,మధ్యతరగతి వారినీ దృష్టిలో ఉంచుకొని రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, డాక్టర్లు దేవునితో సమానమని నలగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంలో ని డీఎంహెచ్ ఆఫీస్ సమీపంలో నూతనంగా నిర్మించిన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ యజమాని వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో వైద్య సేవలు అందించాలని కోరారు. రోగులను ప్రేమగా పలకరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు.వైద్యులు రోగులను స్నేహభావంతో పలకరించి,వారి సమస్యలను తెలుసుకొని,పరిష్కార మార్గం చూపాలన్నారు.అనంతరం హాస్పటల్ యజమాని డాక్టర్ ముది బీర్ మాట్లాడుతూ మా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో 24 గంటల వైద్య సేవలు అందించి,అన్ని విభాగాలకు అత్యవసర వేళలో చూడటం జరుగుతుందని చెప్పారు.మరింత విశ్వాసంతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించి ఉత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా మల్టీస్పెషల్టి ఆసుపత్రిని జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ హఫీస్ ఖాన్, ముస్లిం మత పెద్దమౌలానా,ఏసానోద్దీన్,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి లు మాట్లాడుతూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం గౌరవ అధ్యక్షులు,హనుమంతరావు, డాక్టర్ ఏ ఏ ఖాన్,సదాత్ లి,జునేద్ హస్మి,తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో అన్నప్రసాద వితరణ



విశ్వంభర, ఆత్మకూరు : అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలంలో పంపనూరు గ్రామంలో శ్రీ అహోబిల లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం మరియు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు, ప్రతి శని ఆదివారాలో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి దర్శనానికి వస్తున్నారు, భక్తులు తీర్థ ప్రసాదాలు మినహా అన్న ప్రసాదాలు అందడం లేదని భక్తులు వాపోయేవారు, ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లగా ఆమె సూచనలు మేరకు ఆలయ ఈవో దేవదాసు , అర్చకులు, మాజీ ఆలయ చైర్మన్ శ్రీరామ్ రెడ్డి మరియు రాజా రమేష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.